ఈనాడు
రాజన్న సిరిసిల్ల
మంగళవారం అక్టోబరు 1, 2024

జిల్లాలోని మధ్యమానేరు, కాళేశ్వరం 9వ ప్యాకేజీ నిర్మాణాల్లో అంచనాలకు మించి చెల్లింపులు చేయడంపై విజిలెన్స్ విచారణ ముమ్మరం చేసింది. దీనికి అప్పటి గుత్తేదారు సంస్థలకు బిల్లుల చెల్లింపుల్లో ఇంజినీర్లు సహకరించారని వచ్చిన ఫిర్యాదుల మేరకు గత నెల 21న కరీంనగర్‌లోని ఈఎన్‌సీ కార్యాలయం నుంచి రెండు ప్రాజెక్టులకు సంబంధించిన అన్ని దస్త్రాలను స్వాధీనం చేసుకున్నారు. నిర్మాణాలు ప్రారంభమైనప్పటి నుంచి పూర్తయ్యే వరకు ఎక్కడెక్కడ అంచనాలు పెంచారు, వాటి వెనక కారణాలు, ప్రభుత్వ అనుమతులు, గుత్తేదారు సంస్థలకు చెల్లింపులు, ఇంజినీర్ల ప్రమేయం ఇలా అన్ని కోణాల్లో పరిశీలిస్తున్నారు. - ఈనాడు డిజిటల్, సిరిసిల్ల



మల్కపేట జలాశయం సమీపంలో పంపుహౌస్ నిర్మాణానికి తవ్వి వదిలేసిన దృశ్యం

అంచనాలకు మించి చెల్లింపులు!

మధ్యమానేరు, 9వ ప్యాకేజీల నిర్మాణాలపై విజిలెన్స్ విచారణ ముమ్మరం

■ కాళేశ్వరం 9వ ప్యాకేజీలో సొరంగం, సర్జ్‌పూల్, మల్కపేట రిజర్వాయరు ప్రధానం. 2015లో కాళేశ్వరం ప్రాజెక్టు రీడిజైన్‌లో గత ప్రభుత్వం దీని సామర్థ్యం పెంచి నిర్మాణ వ్యయాన్ని రూ.911 కోట్లుగా నిర్ణయించింది. మధ్యమానేరు వెనక జలాలు నుంచి మల్కపేట జలాశయానికి 12 కిలోమీటర్ల సొరంగం తవ్వకాల్లో తీవ్ర జాప్యం జరిగింది. 2018లో పనుల్లో వేగం పెంచేందుకు సిరిసిల్ల శివారులోని చంద్రంపేట వద్ద సొరంగానికి అదనపు అడిట్‌ను ఏర్పాటు చేశారు. దీనికోసం భూసేకరణ, అడిట్ నిర్మాణానికి కలిపి రూ.6 కోట్లు అదనపు వ్యయం చేశారు.



జలాశయం సమీపంలో నిర్మించిన కంట్రోల్ గది

■ సొరంగం నుంచి మల్కపేట జలాశయంలోకి నీటిని తరలించేందుకు ఉపరితల పంపుహౌస్ నిర్మాణం చేపట్టారు. దీన్ని పరిశీలించిన అప్పటి ఇంజినీరింగ్ ఉన్నతాధికారులు ఉపరితలంలో కాకుండా సొరంగంలోనే ఉండాలని సూచించడంతో తవ్వకాన్ని పంపుహౌస్ మధ్యలో వదిలేసి సొరంగంలో మరొకటి తవ్వారు. దీనికి రూ.22 కోట్ల మేర అదనపు ఖర్చు చేశారు.

■ 2021, 2022లో కురిసిన భారీ వర్షాలకు సొరంగం పూర్తిగా మునిగిపోయింది. అప్పటికే భూగర్భంలోని కంట్రోల్ గది నిర్మాణం జరుగుతోంది. భవిష్యత్తులో వరదలొస్తే కంట్రోల్ గది మునిగి అందులోని ఎలక్ట్రికల్ ప్యానెల్స్, కంప్యూటర్ వ్యవస్థకు తీవ్ర నష్టం జరుగుతుంది. దీంతో కంట్రోల్ గదిని పైన మల్కపేట జలాశయం పక్కన నిర్మించారు. దీనికి అదనంగా రూ.50 కోట్లు ఖర్చయింది. సొరంగంలో నీటిని తోడేందుకు ఇతర పనులకు రూ.7 కోట్ల వరకు అదనపు చెల్లింపులు చేశారు. మొత్తంగా ప్రాజెక్టు వ్యయం రూ.996 కోట్లకు పెరిగింది.

పాత సంస్థకే రెండోసారి పనులు

మధ్యమానేరు జలాశయం పనుల్లోనూ గుత్తేదారు సంస్థలకు పనుల ఒప్పందంలో నిబంధనలు పాటించకపోవడం వల్ల రూ.224 కోట్ల ప్రజాధనం నష్టం వాటిల్లిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. జలాశయం పనులు జరుగుతుండగా 2016 సెప్టెంబరులో మానేరు, మూలవాగుల్లో భారీగా వరదలు రావడంతో స్పిల్‌వే ఎడమవైపు మట్టికట్ట కొట్టుకుపోయింది. నాణ్యత లేని పనులతోనే కొట్టుకుపోవడంతో ఈ నష్టాన్ని గుత్తేదారు సంస్థనే భరించాలి. కానీ అప్పటి ప్రభుత్వం నోటీసులు ఇచ్చి సరిపెట్టింది.

■ గత ప్రభుత్వం 2016లో మరోసారి టెండర్లు పిలిచింది. జాయింట్ వెంచర్‌గా ఏర్పడిన రెండు గుత్తేదారు సంస్థలు జలాశయం నిర్మాణ పనులు దక్కించుకున్నాయి. అందులో ఒకటి పాత నిర్మాణ సంస్థ కావడం గమనార్హం. నాణ్యత లోపంతో పనులు చేపట్టి మట్టి కట్టకు గండిపడేందుకు కారణమైన సంస్థపై చర్యలు తీసుకోకపోగా, తిరిగి అదే సంస్థకు పనులు అప్పగించడంపై ఇంజినీర్ల సహకారం ఉందని ఆరోపణలు ఉన్నాయి.

■ కుడిమట్టి కట్ట నిర్మాణానికి పాత ధరలు, గండిపడిన ఎడమవైపు 2016లోని కొత్త ధరల ప్రకారం చెల్లింపులు చేసి గుత్తేదారు సంస్థకు అనుకూలంగా వ్యవహరించారనే విమర్శలున్నాయి. వీటికి సంబంధించి ప్రాజెక్టుల స్టాండింగ్ కమిటీ తీర్మానాలు, ఆర్థిక సంఘం నిధుల మంజూరు తదితర దస్త్రాలను విజిలెన్స్ బృందం సేకరించింది. విచారణ తర్వాత గుత్తేదారులకు చెల్లించిన అదనపు నిధులకు ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా? ఇంజినీర్ల ప్రమేయం ఏ మేరకు ఉందనే దానిపై స్పష్టత వస్తుంది.

ఇసుకకు అనుమతివ్వండి


సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: వేములవాడ పురపాలక సంఘంలో వివిధ గ్రాంట్ల కింద చేపట్టిన అభివృద్ధి పనులకు ఇసుక తరలింపునకు అనుమతి ఇవ్వాలని ఛైర్‌పర్సన్ మాధవి కోరారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సందీప్‌కుమార్ ఝాకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో సుమారు రూ.2 కోట్లతో వివిధ పనులకు ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి గుత్తేదారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ఇటీవల కాలంలో పనులు మందగించాయని, ప్రస్తుతం గుత్తేదారులు పనులు చేసేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో ఇసుక కొరత ఏర్పడిందని, ఇసుక సరఫరా లేకపోవడం వల్ల పనులు చేపట్టలేకపోతున్నట్లు పేర్కొన్నారు.

తరచూ తిందాం.. ఆరోగ్యంగా ఉందాం!

- జీవనశైలికి మేలు చేసే కూరగాయలు
- నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం

ఈనాడు, కరీంనగర్

మారుతున్న జీవనశైలిలో శాకాహార ప్రాధాన్యం పెరుగుతోంది. దురలవాట్లతో దుష్ఫలితాలు కొంత. వైద్యులు సూచిస్తున్నారని మరికొందరు.. శాకాహారులుగా మారిపోతుండగా.. అప్పుడప్పుడు మాత్రమే మాంసాహారం తీసుకుంటూ వారంలో వీలైనన్ని ఎక్కువ రోజులు శాకాహార రుచిని మరికొందరు ఆస్వాదిస్తున్నారు. నేడు ప్రపంచ శాకాహార దినోత్సవం సందర్భంగా కథనం.



ప్రయోజనాలనేకం..

- బీన్స్, కూరగాయలు, పప్పులు, బఠాణీలు తీసుకోవడం వల్ల శరీరానికి పొటాషియం, ఐరన్, పీచు సమృద్ధిగా అందుతుంది.
- మంచి బ్యాక్టీరియాపై కూరగాయలు సానుకూల ప్రభావాన్ని చూపుతాయి. చెడు కొలెస్ట్రాల్ తగ్గుతుంది.
- తక్కువ కొవ్వు ఉండే వాటిని తినడం వల్ల మధుమేహం తగ్గుతుంది. పీచు పదార్థాలను తీసుకుంటే ఇన్సులిన్ ఉత్పత్తి మెరుగుపడుతుంది.
- శాకాహారంతో మానసిక ఆరోగ్యం మెరుగ్గా ఉంటుంది. మాంసం వల్ల అరాకిడోనిక్ యాసిడ్ ఉత్పత్తి అయి మానసిక ప్రవర్తనపై ప్రభావం చూపుతుంది.
- ఆరోగ్యంగా ఉండటానికి అవసరమైన పీచు పదార్థాలు, పోషకాలు, యాంటీ ఆక్సిడెంట్స్, విటమిన్స్, మినరల్స్ శరీరానికి చేరుతాయి.

ఇది నిజమేనండోయ్..!

- ప్రతి రోజు భోజనంలో పండ్లు, కూరగాయలు తీసుకున్న వారికంటే.. వీటిని తీసుకోని వారిలో 30 శాతం హృదయ సంబంధ జబ్బులుంటున్నాయట.!
- శాకాహారం సరిగ్గా తినని 26-30 ఏళ్ల మధ్య వయసున్న యువకుల్లో కొవ్వు స్థాయి మించి ఉంటుందని.. హృద్రోగ సమస్యలు అధికమని వైద్యులు చెబుతున్నారు.
- రోజులో 8 శాతం పండ్లు, ఆకుకూరలు తీసుకోవాల్సిన చోట గరిష్ఠంగా 1.5 శాతాన్ని కూడా మించకపోవడంతో పోషకాలు సరిగ్గా అందడం లేదు.
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ న్యూట్రిషన్ (ఎన్‌ఐఎన్) సర్వే ప్రకారం ప్రతిరోజు తినే ఆహారంలో 20 శాతం పీచు పదార్థాలు తప్పకుండా ఉండాలి.
- యువతుల్లో ఐరన్ లోపాన్ని అధిగమించేందుకు రోజూ ఆకు కూరల్ని తీసుకోవడంతో మేలు జరుగుతుందని వైద్యులు చెబుతున్నారు.
- ఎరుపు, పసుపు, ఆరెంజ్ రంగుల్లో ఉండే కాయగూరలతో యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా అందుతాయి. దీంతో ఆరోగ్యం మెరుగవుతుంది.

సాగు తగ్గి.. దిగుమతి భారం

ఉమ్మడి జిల్లాలో కూరగాయల సాగు గణనీయంగా తగ్గిపోతోంది. దశాబ్దం కిందటితో పోలిస్తే జిల్లాలో ఉత్పత్తి తగ్గింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకుంటుండడంతో వీటి ధరలు నింగిని తాకుతున్నాయి. కూరగాయలకు ప్రోత్సాహకాలు తగ్గడం, రాయితీ విత్తనాల సరఫరా, సరైన మార్కెటింగ్ లేక రైతులు సాగుకు విముఖత చూపిస్తున్నారు. 2016లో 6300 హెక్టార్లలో సాగైన సాగు.. ఇప్పుడు 1600కు పైగా హెక్టార్లకు పడిపోయింది. అన్నిరకాల ఆకుకూరలు కలిపి ప్రతి వ్యక్తి రోజులో 300 గ్రాములను ఆహారంగా తీసుకోవాలి. ఇలా ఏడాదికి 109.5 కిలోలవరకు. 38 లక్షల జనాభా ఉన్న జిల్లాలో 4.14 లక్షల మెట్రిక్ టన్నుల కూరగాయలవసరం. ప్రస్తుత ఉత్పత్తి ఏడాదిలో సగం కూడా ఉండటం లేదు. ఈ లోటునంతా పూరించేందుకు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. ఈ పరిస్థితిలో మార్పు వచ్చే విధంగా కూరగాయల ప్రజలకు జిల్లాలోనే అందేవిధంగా చొరవ చూపాలి.

పోషకాల లోపం ఉండదు..



నేడు ఫాస్ట్ ఫుడ్, మాంసాహార వినియోగం పెరగడంతో చాలామందిలో పోషకాల లోపం కనిపిస్తోంది. ముఖ్యంగా చిన్నారుల్లో అధికంగా ఈ సమస్య ఉంది. ఆకు కూరలు, కూరగాయల ద్వారా చాలా పోషకాలు అందుతాయి. అన్ని వయసుల వారు ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి. తాజా ఆకుకూరలు, కాయగూరలతో జీర్ణక్రియ మెరుగుపడుతుంది. తృణధాన్యాలు, మొలకెత్తిన విత్తనాల వల్ల కూడా పోషకాలు దండిగా అందుతాయి. - డాక్టర్ ఎం.సాయిప్రియ, న్యూట్రిషియన్, కరీంనగర్

డీఎస్సీ జనరల్ ర్యాంకింగ్ జాబితా విడుదల

సిరిసిల్ల(విద్యానగర్), న్యూస్‌టుడే: ఇటీవల నిర్వహించిన డీఎస్సీ పరీక్ష జనరల్ ర్యాంకింగ్ జాబితాలను ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ సందర్భంగా 233 ర్యాంకులతో కూడిన జిల్లా జాబితాను విడుదల చేసింది. సందారి నిరోషకు మొదటి ర్యాంకు రాగా, అక్షిల అనితకు రెండు, అంజు మల్లేశంకు మూడు, నేరెళ్ల సౌజన్యకు నాలుగు, సుద్దాల మౌనికకు ఐదో ర్యాంకు వచ్చింది. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థుల వివరాలను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు జిల్లా విద్యాధికారి రమేశ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. 1:3 నిష్పత్తిలో ఎంపికైన అభ్యర్థులు అక్టోబర్ 1 నుంచి 4 వరకు సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ధ్రువీకరణ పత్రాల పరిశీలనకు హాజరుకావాలని పేర్కొన్నారు.

ఉత్తమ ప్రతిభ

వేములవాడ గ్రామీణం: ఉపాధ్యాయ నియామక పరీక్ష ఫలితాల్లో వేములవాడ గ్రామీణ మండలం హన్మాజీపేటకు చెందిన కోడం చంద్రశేఖర్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. డీఎస్సీ పరీక్షలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల భాష విభాగంలో 100 మార్కులకు గాను 77.03 మార్కులు సాధించి జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించాడు. చంద్రశేఖర్ జీవిత వెలుపడిన గురుకుల ఉపాధ్యాయ పరీక్ష ఫలితాల్లో ఉద్యోగం సాధించి వేములవాడ గురుకులంలో పని చేస్తున్నాడు. తండ్రి నారాయణ, తల్లి కమల రోజు కూలీలుగా పనిచేస్తున్నారు. మొదటి ర్యాంక్ సాధించడంతో కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.



కోడం చంద్రశేఖర్

పీఈటీ కొలువు సాధించిన యువకుడు

కోనరావుపేట: కోనరావుపేట మండలం మామిడిపల్లికి చెందిన బెదిరె మీనా-కుంటయ్య దంపతుల కుమారుడు శ్రీకాంత్ తొలి ప్రయత్నంలోనే పీఈటీ కొలువు సాధించాడు. ప్రభుత్వం డీఎస్సీ పోటీ పరీక్షల ఫలితాలను సోమవారం విడుదల చేసింది. శ్రీకాంత్ పీఈటీలో జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచి కొలువుకు ఎంపికయ్యాడు.



శ్రీకాంత్

ప్రధాన రోడ్డు.. ప్రమాదకర గుంతలు

కోనరావుపేట మండలం సుద్దాల నుంచి నందికమాన్ వరకు ప్రధాన రహదారిలో పలు చోట్ల గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. వర్షానికి తారు, కంకర చెదిరి మరింత పెద్దవి అవుతున్నాయి. వాటి వద్ద ఎలాంటి హెచ్చరిక బోర్డులు లేవు. నిత్యం భారీ సంఖ్యలో వాహనాల రాకపోకలు సాగుతుంటాయి. రాత్రివేళల్లో గుంతలు కనిపించక ఇబ్బందులు పడుతున్నారు. వాహనదారులు ఏమరుపాటుగా ఉంటే ప్రమాదాల బారిన పడే అవకాశం నెలకొంది. ఇప్పటికైనా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు స్పందించి మరమ్మతులకు చర్యలు తీసుకోవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కోనరావుపేట



హర హర మహాదేవ

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి క్షేత్రానికి సోమవారం భక్తుల తాకిడి పెరిగింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భారీగా తరలి వచ్చారు. ధర్మగుండంలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. పలువురు కుటుంబ సమేతంగా కోడె మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఈవో వినోద్‌రెడ్డి, ఆలయ పర్యవేక్షకులు పరిశీలించారు. దాదాపు 25 వేల మంది దర్శించుకున్నట్లు అధికారులు తెలిపారు.

ముందస్తు బతుకమ్మ వేడుకలు

ఆధ్యాత్మిక పట్టణమైన వేములవాడలో చిన్న బతుకమ్మకు రెండు రోజుల ముందుగానే సోమవారం వేడుకలు ప్రారంభమయ్యాయి. బుధవారం అమావాస్య ఉన్న నేపథ్యంలో మంగళవారం చేయాల్సిన బొడ్డెమ్మ పండగను ముందస్తుగా వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలు భక్తి శ్రద్ధలతో చేశారు. దీంతో ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ పాటలు కోలాహలం నెలకొంది. పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర సంస్కృత కళాశాల విద్యార్థినులు, ఉపాధ్యాయినులు బతుకమ్మ ఆడి పాడారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మల్లారెడ్డి, వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, సూపరింటెండెంట్ శ్రీనివాస్‌శర్మ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. - న్యూస్‌టుడే, వేములవాడ



రాజన్న ఆలయ ప్రాంగణంలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



శ్రీరాజరాజేశ్వర సంస్కృత కళాశాల విద్యార్థినులు, ఉపాధ్యాయినులు

మహా లింగార్చన

వేములవాడ, న్యూస్‌టుడే: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి క్షేత్రంలో సోమవారం మాస శివరాత్రి పురస్కరించుకుని మహా లింగార్చనను అర్చకులు, వేద పండితులు మంత్రోచ్ఛారణల మధ్య ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, పరివార దేవతార్చనలను పూర్తి చేసిన అనంతరం మంది రుత్విజులచే ఘనంగా నిర్వహించారు. రాత్రి ఆలయ కల్యాణ మండపంలో మహా లింగార్చన జరిపారు. ఈ సందర్భంగా 365 పిండి ప్రమిదలను తయారు చేసి లింగాకారంలో పేర్చి భక్తి ప్రపత్తులతో వెలిగించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, వేద పండితులు, భక్తులు పాల్గొన్నారు.



మహా లింగార్చనలో అర్చకులు, భక్తులు

కోడెల పంపిణీ నిరంతర ప్రక్రియ

వేములవాడ, న్యూస్‌టుడే: కోడెల పంపిణీ నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. సోమవారం వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాలలోని కోడెలను అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. ముందుగా ఆలయ ఈవో వినోద్‌రెడ్డితో కలిసి విప్ కోడెలకు ప్రత్యేక పూజలు చేసి అర్హులైన రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో విప్ మాట్లాడుతూ దక్షిణ కాశీగా పేరుగాంచిన రాజన్న ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు నిజ కోడెలను సమర్పించి మొక్కులు తీర్చుకుంటారని, వాటిని పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మూడు నెలల క్రితం దాదాపు 1,600 పంపిణీ చేశామన్నారు. వాటిని తీసుకెళ్లే రైతులు రాజన్న ప్రసాదంగా భావించి పెంచాలన్నారు. కబేళాలకు తరలించకుండా వాటిని సంరక్షించుకోవాలని, వాటి సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కోడెలను ఇతరులకు విక్రయించరాదని, వ్యవసాయ పనులకు మాత్రమే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ బింగి మహేశ్, తహసీల్దార్ మహేశ్, ఆలయ ఏఈవో శ్రీనివాస్, సిబ్బంది, అర్చకులు, రైతులు పాల్గొన్నారు.



పూజ చేస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, చిత్రంలో ఆలయ ఈవో వినోద్‌రెడ్డి తదితరులు

ఈ పాస్ వెబ్‌సైట్‌లో మార్పు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: 2024-25 విద్యాసంవత్సరానికి జిల్లాలోని అర్హులైన ఎస్సీ విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాల నమోదుకు సంబంధించి నూతన విధి విధానాలు కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఈ పాస్ వెబ్‌సైట్‌లో మార్పు చేసినట్లు జిల్లా ఎస్సీ అభివృద్ధి శాఖ అధికారి విజయలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన విద్యార్థులు పదో తరగతి మెమోలో ఉన్న విధంగానే ఆధార్‌లో పేరు ఉండాలన్నారు. వార్షిక ఆదాయం రూ.2 లక్షల నుంచి రూ.2.50 లక్షలకు పెంచినట్లు వెల్లడించారు. విద్యార్థి వివరాలు సంబంధిత వెబ్‌సైట్‌లో నమోదు చేసిన తర్వాత 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు వివరాలు సరిపోయిన తర్వాత ఆధార్‌లో 12 అంకెల ఈ పాస్ ఐడీ ఇవ్వబడుతుందని, దాంతో మీ సేవా కేంద్రంలో బయోమెట్రిక్ వేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆ తర్వాత విద్యార్థి దగ్గరలోని ఆన్‌లైన్ సెంటర్‌లో పూర్తిస్థాయిలో నమోదు ప్రక్రియను చేసి సంబంధిత ధ్రువపత్రాలను జత పరిచి సంబంధిత కళాశాలలో సమర్పించాలన్నారు.

మొర విన్నారు.. మోక్షం కల్పించండి

న్యూస్‌టుడే, సిరిసిల్ల కలెక్టరేట్

ప్రజావాణిలో 102 దరఖాస్తుల స్వీకరణ

తమ సమస్యలను పరిష్కరించి న్యాయం చేయాలంటూ జిల్లా నలుమూలల నుంచి కలెక్టరేట్‌కు అర్జీదారులు తరలివచ్చి జిల్లా యంత్రాంగానికి వినతి పత్రాలను అందజేశారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశమందిరంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్‌లు అర్జీలను స్వీకరించారు. ప్రజల నుంచి మొత్తం 102 దరఖాస్తులను స్వీకరించి సంబంధిత అధికారులకు అందజేశారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచవద్దని సూచించారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

వితంతు పింఛను రావడం లేదు



నా భర్త కొమురయ్య 2022 సంవత్సరంలో మరణించాడు. గతంలో నా భర్తకు పింఛను వచ్చేది. నాకు వితంతు పింఛను ఇప్పించాలని దరఖాస్తు చేసుకున్నాను. అధికారుల వద్దకు ఎన్నిసార్లు తిరిగినా మంజూరు చేయడం లేదు. పింఛను ఇప్పించాలి. - బోడపటి ఎల్లవ్వ, తంగళ్లపల్లి

మందులు కొనలేని పరిస్థితిలో ఉన్నా




నాకు క్యాన్సర్ వచ్చి ఒక కాలు తీసేశారు. మాది చాలా నిరుపేద కుటుంబం. మందులు కూడా కొనలేని పరిస్థితిలో ఉన్నా. నాకు ఇద్దరు ఆడపిల్లలు. ఎలాంటి జీవనాధారం లేదు. దివ్యాంగుల పింఛను ఇప్పించి ఆదుకోవాలి. - బత్తుల నరేశ్, ఆవునూరు, ముస్తాబాద్ మండలం

ఎలక్ట్రిక్ స్కూటీ ఇప్పించండి



నేను 87 శాతం అంగవైకల్యంతో చేతికర్రలు లేనిదే ఎటూ నడవలేని పరిస్థితిలో ఉన్నాను. అయినప్పటికీ ట్రై సైకిల్ ద్వారా మార్కెట్‌లో కూరగాయలు అమ్ముకుంటూ జీవిస్తున్నాను. రెక్కాడితే గాని డొక్కాడని కుటుంబం నాది. కుటుంబ పోషణ కోసం ఏదో ఒక పని చేయాలి. నాకు మూడు చక్రాల ఎలక్ట్రిక్ స్కూటీని ఇప్పించాలి. - పందుగు పోచయ్య, జంగంరెడ్డిపల్లి, ఇల్లంతకుంట మండలం

నా భూమిని ఆన్‌లైన్‌లో చేర్చండి



నేను గతంలో ఇతరుల నుంచి ఎకరం భూమిని కొనుగోలు చేశాను. అందులో 36 గుంటల భూమిని ఆన్‌లైన్ నుంచి తొలగించారు. దీని కోసం అధికారుల వద్దకు పలుమార్లు వెళ్లాను. 18 నెలల క్రితం సర్వే కూడా చేశారు. అయినా పరిష్కారం చూపలేదు. భూమికి సంబంధించిన డాక్యుమెంట్లను పరిశీలించి ఆ భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. - వీరారెడ్డి, విలాసాగర్, బోయినపల్లి మండలం

తెగుళ్ల తరుణం.. యాజమాన్యం కీలకం

పైరులో సమస్యలు, నివారణపై జగిత్యాల పరిశోధన స్థానం శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. - న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

వరి: దుబ్బుచేసే దశలోని వరిపైరుపై చాలాప్రాంతాల్లో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించింది. ఆకులపై పసుపురంగు మచ్చలేర్పడి అంచుల నుంచి కిందకు వ్యాపిస్తాయి. తెగులు 5 శాతం కన్నా ఎక్కువైతే నత్రజని వేయడాన్ని తాత్కాలికంగా నిలిపివేయాలి. తెగులుసోకిన పొలం నుంచి నీటిని రెండుసార్లు పూర్తిగా బయటకు పంపాలి. లీటరు నీటికి అగ్రిమైసిన్ 0.4 గ్రాములు లేదా ప్లాంటమైసిన్ లేదా పోషామైసిన్ మందు ద్రావణాన్ని 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు పైరుపై పిచికారీ చేయాలి. ఈనిక దశలోని పైరుపై మొగిపురుగు నివారణకు కార్టాప్ హైడ్రోక్లోరైడ్ 50 ఎస్పీ మందు 2 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పలుచోట్ల కనిపిస్తున్న జింకు ధాతువు లోప నివారణకు 2 గ్రాముల జింకుసల్ఫేట్‌ను లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు, మూడుసార్లు పిచికారీ చేయాలి. జింకు సల్ఫేట్‌లో పురుగు, తెగుళ్లమందును కలపకూడదు. అగ్గితెగులు వ్యాపిస్తున్నందున 0.6 గ్రాముల ట్రైసైక్లజోల్ లేదా 1.5 మి.లీ ఐసోప్రొథయోలినను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.


రైతేరాజు



మొక్కజొన్న: ఆలస్యంగా విత్తిన మక్కలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 0.4 గ్రాముల మందును లేదా క్లోరాంట్రనిలిప్రోల్ 0.4 మి.లీ మందును లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. మొక్కల దశదాటి పైరులో కత్తెర పురుగు గుర్తిస్తే 9 కిలోల ఇసుకకు ఒక కిలో సున్నాన్ని కలిపిన మిశ్రమాన్ని మొక్కజొన్న కర్రల మొగిలో వేసుకోవాలి. ఎకరానికి ఎండుతెగులు నిరోధానికి 100 కిలోల వేపపిండికి 4 కిలోల బ్లీచింగ్ పౌడరును కలిపి పొలమంతా చల్లాలి. మక్కలో తేమ ఎక్కువ ఉన్నా పోషకాలను గ్రహించలేవు. ఈ సమయంలో యూరియా 20 గ్రాములు లీటరు నీటికి కలిపిగాని డీఏపీ 1-2 గ్రాములు లేదా 19-19-19 మందును 5 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. పూతదశలో ఎకరాకు 50 కిలోల యూరియా చొప్పున వేసుకోవాలి.



పత్తి: రసంపీల్చు పురుగు తీవ్రత ఎక్కువగా ఉన్నందున మోనోక్రోటోఫాస్, నీటిని 1:4 నిష్పత్తిలో లేదా ఇమిడాక్లోప్రిడ్, నీటిని 1:20 నిష్పత్తిలో కలుపుకొని కాండానికి పూత పద్ధతిని ఆచరించాలి. పత్తి పూత దశలో 2 శాతం యూరియాను మొక్కలపై పిచికారీ చేయాలి. పత్తి మొక్కలు ఎండిపోవటం గమనించిన చోట 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల కార్బెండజిమ్, మాంకోజెబ్‌ను లీటరు నీటికి వంతున కలిపి 5-7 రోజుల వ్యవధిలో రెండుసార్లు మొక్కల అడుగు భాగం తడిచేలా పిచికారీ చేయాలి.



సాగులో రైతుల సందేహాలను జమ్మికుంట కృషి విజ్ఞాన కేంద్ర ఉద్యాన శాస్త్రవేత్త జి.వేణుగోపాల్ నివృత్తి చేశారు.



రైతు ప్రశ్న — శాస్త్రవేత్త సమాధానం



? **టమాట సాగులో ఆకు మాడు తెగులు వస్తుంది.**
- రాజమల్లు, రామన్నపల్లి

✓ టమాట నారు నాటిన పది రోజుల నుంచి ఆకులపై మచ్చలు మొదలై 30 రోజులకు ఎండే స్థాయికి వస్తుంది. నివారణకు మెటీరాం, పైరాక్లోస్ట్రోబిన్ కలగలిసిన మందును లీటరు నీటికి 3 గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

? **బీరతోటలో ఆకులపై తెల్లని బూజుమచ్చలు కన్పిస్తున్నాయి. - మహేందర్, మొత్కులగూడెం**

✓ మైక్లోబ్యూటానిక్ మందును లీటరు నీటికి 1 గ్రాము కలిపి పిచికారీ చేయాలి. **- న్యూస్‌టుడే, జమ్మికుంట**

సేంద్రియ విధానంలో సాగా?

మీకు తెలుసా?

సేంద్రియ విధానంలో కూరగాయల సాగు చేపట్టే వారు నేలలో పశువుల, కోళ్ల, జీవాల ఎరువు, లేదా వర్మికంపోస్టును వేసి కలియదున్నాలి. వేపపిండి, వేరుసెనగపిండి, ఆముదపు పిండి తదితరాలు వాడవచ్చు. పంటమార్పిడి పాటించాలి. జీవన ఎరువులైన అజటోబాక్టర్, అజోస్పైరిల్లం, ఫాస్ఫోబాక్టీరియాను వినియోగించవచ్చు. రసాయనాలను వాడకుండా సహజ సస్యరక్షణ యాజమాన్య పద్ధతులు పాటించాలి.

- న్యూస్‌టుడే, జగిత్యాల వ్యవసాయం

నాటుకోళ్ల ఫారం.. యువరైతు ఆదర్శం

న్యూస్‌టుడే, మెట్‌పల్లి పట్టణం

అందరిలా మూసధోరణిలో పంటల సాగు చేపట్టకుండా వినూత్న ఆలోచనతో యువరైతు ముందుకెళ్తున్నాడు. కోళ్ల ఫారం నిర్వహించడానికి శ్రీకారం చుట్టి లాభాలు పొందుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు.

30 గుంటల్లో ఫారం: మెట్‌పల్లి మండలం మెట్లాచిట్టాపూర్‌కు చెందిన ఉత్తమ ఆదర్శ రైతు రాజారపు భూమేశ్వర్ తనయుడు రాజారపు ప్రతీశ్.. డిగ్రీ వరకు చదువుకున్నాడు. నాటుకోళ్ల పరిశ్రమ నిర్వహించాలని నిర్ణయించుకున్నాడు. గ్రామ శివారులోని వారికి ఉన్న 7 ఎకరాల్లో సుమారు 30 గుంటల భూమిని ఎంపిక చేసుకొని 2021లో నాటుకోళ్ల ఫారాన్ని ఏర్పాటు చేశాడు. వరంగల్ నుంచి ఒక్కో కోడి పిల్లకు రూ.35ల చొప్పున చెల్లిస్తూ నాలుగు నెలలకోసారి 500 వరకు తీసుకొస్తున్నాడు. రెండు నెలల వరకు వాటికి కావాల్సిన దాణాను అందిస్తూ నాటుకోళ్లను విక్రయిస్తున్నాడు.



భలే డిమాండ్ : హోటళ్లతోపాటు చికెన్ సెంటర్ల యజమానులు నేరుగా ఫారం వద్దకే చేరుకుని నాటుకోళ్లను కొనుగోలు చేస్తున్నారు. బయట కిలోకు రూ.550 నుంచి రూ.600ల వరకు ధర ఉంటోంది కానీ.. ఫారం వద్ద రూ.400లోపే ఇస్తుండటంతో చాలా ప్రాంతాల నుంచి కొనుగోలుదారులు వస్తున్నారు. 4 నుంచి 5 నెలలకోసారి సుమారుగా రూ.2 లక్షల వరకు ఆదాయం వస్తుండగా.. పెట్టుబడి రూ.80 వేలుపోను రూ.1.20 లక్షల లాభం మిగులుతోంది. నిత్యం ఉదయం, సాయంత్రం రెండు గంటల చొప్పున నాటుకోళ్లను చూసుకుంటూ మిగతా సమయంలో తండ్రితో కలిసి వ్యవసాయం చేస్తుంటానని.. ప్రస్తుతం కోళ్లఫారంపై లాభాలు వస్తున్నందున సంతోషంగా ఉందని తెలిపాడు ప్రతీశ్.



బాధ్యత గుర్తిద్దాం.. భరోసానిద్దాం!

నేడు ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

న్యూస్‌టుడే, కరీంనగర్ మంకమ్మతోట

ఒకప్పుడు ఇంట్లో పెద్ద మనిషి ఉండేలానుకునే వారు. జీవితంలో వారి అనుభవానికి ప్రాధాన్యమిచ్చేవారు. ఏదైన సలహా అవసరమైతే వారినే సంప్రదించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి మారింది. వారిని భారంగా భావిస్తున్నారు. వయసు మీద పడిన తల్లిదండ్రులను వేరుగా ఉంచుతున్నారు. లేదా ఆశ్రమంలో చేర్పిస్తున్నారు. దిక్కూమొక్కులేని వారిని ప్రభుత్వ ఆశ్రమాలు చేర్చుకుంటున్నాయి. వృద్ధాప్యం అనేది సామాజిక సమస్యగా మారడంతో భారత ప్రభుత్వం వృద్ధుల సంరక్షణ చట్టాన్ని తీసుకొచ్చింది. కానీ దానిని అమలు చేయాల్సిన అధికారుల ఉదాసీన వైఖరితో వారికి భరోసా కరవైంది. మంగళవారం ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని బాధ్యతను గుర్తించి.. వారికి భరోసా ఇవ్వాలని సూచిస్తూ ప్రత్యేక కథనం.



కరీంనగర్ ప్రభుత్వ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులు

చట్టం ఏం చెబుతుందంటే...

భారత ప్రభుత్వం 2007లో తల్లిదండ్రులు, వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం తీసుకొచ్చింది. ఈ చట్టం ప్రకారం రెవెన్యూ డివిజన్ స్థాయిలో అప్పిలేట్ ట్రిబ్యునల్ ఏర్పాటు చేశారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసిన వారిని ట్రిబ్యునల్‌లో విచారించి, న్యాయం చేయాలి. వారు జీవించడానికి భృతి ఇప్పించాలి. ట్రిబ్యునల్ ఆదేశాలను బేఖాతర్ చేస్తే కలెక్టర్ జోక్యం చేసుకొని న్యాయం చేయాలి. అనాథలు, ఆదరణకు నోచుకొని వృద్ధులు జీవించడానికి వారిని అనాథాశ్రమాల్లో చేర్పించాలి. వారు ఆరోగ్యంగా ఉండేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలి. పోలీసులను ఆశ్రయించిన వారికి సత్వర న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలి. కానీ క్షేత్రస్థాయిలో సరిగా అమలు కావడంలేదు.

టోల్‌ఫ్రీ నంబర్.. 14567

వృద్ధులు ఎలాంటి ఆపదలో ఉన్నా.. 14567 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించవచ్చు. వారు ఆపదలో ఉన్నట్లైతే సురక్షిత ప్రాంతానికి తరలించడానికి వాహన సౌకర్యం సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సేవలందించేందుకు ఒక వాహనం కరీంనగర్ జిల్లాలో అందుబాటులో ఉంది.



ఒకే వేదికపై కలుసుకునేలా..

జిల్లా కేంద్రంలో రెండేళ్ల కిందట డేకేర్ సెంటర్ ఏర్పాటు చేశారు. వారందరు కలిసి మాట్లాడుకోవడానికి సమావేశ గది, దినపత్రికలు, ఫిజియోథెరపీ లాంటి సౌకర్యం కల్పించారు. పలువురు వృద్ధులు ప్రతి రోజు సమూహంగా కలిసి ఒంటరితనం లేకుండా ఆహ్లాద వాతావరణంలో ఉండే అవకాశం దక్కింది.


పెరుగుతున్న ఆశ్రమాలు..

గతంలో వృద్ధాశ్రమాల్లో అనాథలు మాత్రమే కనిపించేవారు. వివిధ కారణాలతో కొందరు ఆశ్రమాలను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి, పదవీ విరమణ పొంది పింఛన్ పొందుతున్న వారికి మాత్రం చాలా చోట్ల కుటుంబాల్లో ఆదరణ లభిస్తుంది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ ఆశ్రమంతోపాటు మరో 13 వృద్ధాశ్రమాలు ఉన్నాయి. ఇప్పుడు తమ తల్లిదండ్రులను చూడకుంటే.. భవిష్యత్తులో తమకూ అదే పరిస్థితి వస్తుందని భావించి బాధ్యతగా మెలగాలి.

సమస్యలతో సహవాసం..

రాష్ట్రంలో హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల తర్వాత ప్రభుత్వ వృద్ధుల ఆశ్రమం కరీంనగర్‌లోనే ఉంది. ఇక్కడ 30 మంది వృద్ధులు, మరో 30 మంది దివ్యాంగులకు చోటు కల్పిస్తున్నారు. యాభై ఏళ్ల కిందట ఏర్పాటు చేసిన ఆశ్రమం కావడంతో భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. సౌకర్యాలూ అంతంత మాత్రమే. పలుమార్లు పర్యటించిన రాష్ట్ర దివ్యాంగుల శాఖ డైరెక్టర్ సైతం నూతన భవనం నిర్మించాలని సూచించినా అడుగు ముందుకు పడట్లేదు. వీరబ్రహ్మేంద్ర అనాథాశ్రమాన్ని 20 ఏళ్లుగా వీరమాధవ్ స్వచ్ఛందంగా నిర్వహిస్తున్నారు. మిగిలిన ఆశ్రమాలు సౌకర్యాల కల్పనను బట్టి రుసుములు తీసుకుంటున్నాయి.

ఇరవై ఏళ్లుగా ఉంటున్నా..



నా పేరు కొండయ్య. వయసు 80 ఏళ్లు. కరీంనగర్ మండలం ఖాజీపురం మా ఊరు. సంతానం లేక, బంధువులు దరికి రానివ్వకపోవడంతో ఇరవై ఏళ్ల కిందట ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. అప్పటి నుంచి ఇక్కడే నా జీవితం, ఆశ్రమంలో మరిన్ని వసతులు కల్పించాలి.

చట్టం పకడ్బందీగా అమలు చేయాలి

రక్షణకు చట్టాలు అమలులో తాత్సారం జరుగుతుంది. చట్టప్రకారం న్యాయం జరగట్లేదు. ఈ విషయంపై ప్రజాప్రతినిధులకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేశాం. చట్టం అమలుకు సంబంధిత అధికారులందరు సహకరించాలి. **- సముద్రాల జనార్దన్‌రావు, వయోవృద్ధుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు**

నిరాదరణకు గురైన వారికి న్యాయం

వయోవృద్ధుల సమస్యలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. ఆపదలో ఉన్న వారి సమాచారం తెలవగానే వారిని సురక్షిత స్థలానికి చేర్చి, అవసరమైన చర్యలు చేపడుతున్నాం. నిరాదరణకు గురైన వారికి న్యాయం జరిగేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నాం.

- ఎం.సరస్వతి, జిల్లా సంక్షేమ అధికారి

బంధువులు పట్టించుకోలేదు..



మాది పెద్దపల్లి జిల్లా. నా పేరు నర్సమ్మ. కొన్నేళ్ల కిందటనే భర్త మరణించాడు. పిల్లలు లేరు. బంధువులు పట్టించుకోలేదు. తప్పని పరిస్థితుల్లో మూడేళ్ల కిందట కరీంనగర్ ప్రభుత్వ ఆశ్రమంలో చేరాను. నాలాంటి దిక్కులేని వారికి ఆసరా నిలవడానికి మరిన్ని ఆశ్రమాలు అవసరం.

హ్యాండ్‌బాల్ జట్టు క్రీడాకారుల ఎంపిక పోటీలు

కరీంనగర్ కొత్తపల్లి, న్యూస్‌టుడే: ఉమ్మడి కరీంనగర్ జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ స్టేడియంలో సోమవారం ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ మహిళలు, పురుషుల ఎంపిక పోటీలు నిర్వహించారు. పోటీల్లో 250 మంది క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చాటారు. పోటీలను జిల్లా యువజన, క్రీడా శాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్, ఆర్ఐ మోడెం సురేష్‌లు ప్రారంభించి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఎంపికైన క్రీడాకారులు అక్టోబరు 9 నుంచి 11 వరకు రంగారెడ్డిలో జరిగే 53వ రాష్ట్ర స్థాయి పోటీలకు హాజరవుతారని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బి.లక్ష్మణ్ తెలిపారు. కార్యక్రమంలో సంయుక్త కార్యదర్శి ప్రభాకర్, కోచ్ వెంకటేష్, మల్లేశ్, సురేందర్, కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

భారాస నేతల మొసలి కన్నీరు

మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క

కరీంనగర్ పట్టణం, మానకొండూర్, న్యూస్‌టుడే : పదేళ్లపాటు పాలన చేసి తెలంగాణను విధ్వంసం చేసిన భారాస నేతలు ప్రస్తుతం అక్రమ కట్టడాలు కూల్చివేస్తుంటే మొసలి కన్నీరు కారుస్తున్నారని పంచాయతీరాజ్, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ధ్వజమెత్తారు. కరీంనగర్ జిల్లా మానకొండూర్‌లోని బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం పోషణ ఆరోగ్య జాతర కార్యక్రమానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ఆమె హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. పలు ప్రాంతాల్లో చెరువు మధ్యలో కొందరు అక్రమంగా భవనాలు నిర్మించారని, వీటితో పట్టణాలు నీటిలో మునిగాయని.. ఖమ్మం, మహబూబాబాద్‌లలో ఇటీవల వచ్చిన వరదలకు ఇలాంటి నిర్మాణాలే కారణమని అన్నారు. గత భారాస ప్రభుత్వం కామారెడ్డి వెళ్లే దారిలో చెరువులోనే రెండు పడకగదుల ఇళ్లను కట్టిందని ఆరోపించారు. మధ్య మానేరు, మల్లన్నసాగర్ జలాశయాల నిర్మాణ సమయంలో గత ప్రభుత్వం స్థానికులను ఎంత బలవంతంగా ఖాళీ చేయించిందో అందరికి తెలుసని అన్నారు. ప్రస్తుతం హరీశ్‌రావు, కేటీఆర్ మొసలి కన్నీరు కారుస్తున్నారని ఎద్దేవా చేశారు. మూసీ పరీవాహక ప్రాంతంలో ఇళ్లు కోల్పోతున్న పేదలకు మాత్రం స్థిర నివాసం కల్పిస్తామని, పేదల డిమాండ్లను సీఎం వింటారని తెలిపారు. అనంతరం మంత్రి సీతక్క కరీంనగర్ అతిథిగృహంలో ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. కలెక్టర్లు, అధికారులు వారంలో 2, 3 రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించాలన్నారు. అమ్మమాట-అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించాలన్నారు. విధులపై అలసత్వం వహిస్తే ఉపేక్షించేదీ లేదని తెలిపారు. 2 నుంచి బతుకమ్మ ఉత్సవాలకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. అనంతరం అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరించారు. సమావేశంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి వాకాటి కరుణ, డైరెక్టర్ కాంతి వెస్లీ, గ్రామీణాభివృద్ధి కమిషనర్ అనితా రామచంద్రన్, కలెక్టర్లు పమేలా సత్పతి, సత్యప్రసాద్, కోయ హర్ష, సందీప్ కుమార్‌ఝా, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



కరీంనగర్‌లో అంగన్‌వాడీ పుస్తకాలను ఆవిష్కరిస్తున్న మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సత్యనారాయణ, అధికారులు

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం

ఎమ్మెల్సీ కోదండరాం

తెలంగాణచౌక్(కరీంనగర్), న్యూస్‌టుడే: ఎక్కడికి వెళ్లినా సమస్యలపై విజ్ఞాపనలు అందుతున్నాయని వాటిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడంతోపాటు ప్రజా గొంతుకగా మారుతానని ఎమ్మెల్సీ ఆచార్య కోదండరాం అన్నారు. సోమవారం కరీంనగర్‌లో జనసమితి ఆధ్వర్యంలో ప్రెస్‌భవన్‌లో కోదండరాం పౌర సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తెలంగాణలో ఇప్పుడిప్పుడే ప్రజాస్వామ్య వాతావరణం నెలకొంటుందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. గత ప్రభుత్వ తప్పిదాలతో ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమైందని ఆరోపించారు. కరీంనగర్‌లో పాత్రికేయులకు ఇచ్చిన నివేశన స్థలాలకు సంబంధించి ఎన్‌వోసీ విషయంపై ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం పలు సంఘాల నేతలు ఎమ్మెల్సీని సత్కరించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, జనసమితి రాష్ట్ర కార్యదర్శి ముక్కెర రాజు, అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి, వివిధ సంఘాల నాయకులు నరహరి జగ్గారెడ్డి, మాసం రత్నాకర్, గోపాల్‌రెడ్డి, జక్కోజు వెంకటేశ్వర్లు, బి.వెంకటమల్లయ్య, మార్వాడి సుదర్శన్, రమణారెడ్డి, ఫయాజ్, జునేద్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ కోదండరాంను సన్మానిస్తున్న పార్టీ నాయకులు, సంఘాల ప్రతినిధులు

సమాజ హితులు.. ప్రాణదాతలు

న్యూస్‌టుడే, కరీంనగర్ సాంస్కృతికం

కృత్రిమంగా సృష్టించలేనిది రక్తం. అందుకే అవసరార్థులకు దానం చేయడం మినహా మరో దారి లేదు. కొందరు కుటుంబ, బంధువర్గాలకు ఇచ్చేందుకు ముందుకొస్తారు. మరికొందరు సామాజిక బాధ్యతతో అవరసరమున్న వారికి ఇస్తారు. ఎలాంటి లాభాపేక్ష లేకుండా సమాజంలో ఆపద సమయంలో ముందుకొచ్చి మానవత్వాన్ని చాటుకుంటున్నారు కొందరు. మంగళవారం 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవం' సందర్భంగా కథనం.



రక్తదానం చేస్తున్న వాలంటీర్లు

వాలంటీర్లు..

రక్తం ఇచ్చే క్రమంలో సూదులకు, నొప్పులకు భయపడటంతోపాటు బలహీనమవుతామని కొందరు భావిస్తారు. ఈ అపోహలు తొలగించేందుకు వాలంటీర్లు కృషి చేస్తున్నారు. ప్రత్యేక శిబిరాలూ నిర్వహిస్తుంటారు. అత్యవసర పరిస్థితుల్లో రోగులకు ప్రత్యక్షంగా దానం చేస్తారు. రోడ్డు ప్రమాదాలు, శస్త్రచికిత్స, హింసాత్మక ఘటనల సమయంలో రక్తం అవసరమవుతుంది. ముఖ్యంగా ఆరోగ్యంగా ఉన్న యువత ఏడాదిలో ఒకటి రెండు సార్లు దానం చేయడం మంచిదని వైద్యులు పేర్కొంటున్నారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ వాలంటీర్లు, యువజన సంఘాలు, సినీ హీరో అభిమాన సంఘాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించి అవసరార్థులకు హితోధికంగా సహాయపడుతున్నారు.

ఈ రోజే ఎందుకంటే..

రక్తనిధి కేంద్రం సంఘం ఏర్పాటుతోపాటు ఇండియన్ సొసైటీ ఆఫ్ బ్లడ్ ట్రాన్స్‌ఫ్యూజన్ అండ్ ఇమ్యునోహెమటాలజీ స్థాపించి డాక్టర్ జై గోపాల్ జోలీ విశేష సేవలందించారు. ఆయన అక్టోబరు ఒకటిన జన్మించడంతో ఏటా ఆ రోజు 'జాతీయ స్వచ్ఛంద రక్తదాన దినోత్సవంగా నిర్వహించుకుంటున్నాం. మన దేశంలో రక్తం కొరతతోపాటు సరిపోయే విధంగా నిల్వ కేంద్రాలు లేవు. ఆరోగ్యవంతుల్లో అపోహలను తొలగించి.. వారు స్వచ్ఛందంగా ముందుకొచ్చేలా ప్రేరణ కల్గించే విధంగా అక్టోబరు ఒకటిన ఈ దినోత్సవం నిర్వహిస్తారు.

ముఖ్యాంశాలు కొన్ని...

- రక్తదానంలో విధిగా డిస్పోజబుల్ నీడిల్స్ వాడాలి.
- కరీంనగర్‌లో 8 రక్త కేంద్రాలు ఉన్నాయి. ఇందులో వెయ్యి లీటర్ల వివిధ గ్రూపు రక్తం అందుబాటులో ఉంది.
- వివిధ స్వచ్ఛంద గ్రూపులలో దాదాపు 3 వేల మంది రక్తదాన వాలంటీర్లు ఉన్నట్లు అంచనా.
- కొందరు జన్మదినాలను పురస్కరించుకొని.. నిల్వ కేంద్రాలకు స్వచ్ఛందంగా వెళ్లి రక్తదానం చేస్తుంటారు.
- దాతకు పరీక్షలు జరిపిన తర్వాతనే రక్తం సేకరిస్తారు.
- ఆరోగ్యవంతులై 18-60 ఏళ్ల వారు.. 45 కిలోలకు పైగా బరువు ఉన్నవారు మాత్రమే ఇవ్వాలి.
- ప్రతి మూడు మాసాలకు ఒకసారి 350 మిల్లీలీటర్లు ఇవ్వొచ్చు.
- స్వచ్ఛంద రక్తదాతలో ఎలాంటి వ్యాధులు, రుగ్మతలు ఉండకూడదు. (రేబిస్, క్యాన్సర్, బీపీ, మధుమేహం, క్షయ, హెచ్ఐవీ, సుఖవ్యాధులు ఉండరాదు)
- కొన్ని యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, సినీ హీరోల అభిమాన సంఘాల ప్రతినిధులు వాట్సప్ గ్రూపుల సమాచారంతో స్వచ్ఛందంగా ముందుకొస్తున్నారు.

65 సార్లు ఇచ్చా..

అవసరార్థులకు, రక్తదాన శిబిరాల్లో ఇప్పటి వరకు 65 సార్లు రక్తదానం చేశాను. నాది 'ఓ పాజిటివ్(విశ్వదాత)' గ్రూప్ కావడంతో తరచూ ఇస్తుంటాను. 1991 నుంచి ఏటా కనీసం రెండు, మూడు సార్లు ఇస్తున్నా. 1997 నుంచి రెడ్‌క్రాస్ సొసైటీ జీవిత కాల సభ్యుడిగా కొనసాగుతున్నా. మూడు సార్లు రాష్ట్ర గవర్నర్ నుంచి, 2023లో మంత్రి పొన్నం ప్రభాకర్ చేతుల మీదుగా అవార్డులు తీసుకున్నా.



- పుట్కూరి రాధాకృష్ణారెడ్డి, కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ

అరుదైన గ్రూప్..

నాది అరుదైన 'బి నెగటివ్' గ్రూప్. అత్యవసర పరిస్థితుల్లో చాలా సార్లు రక్తదానం చేశా. ఆ రోగి ఆరోగ్యం కుదుటపడిన తర్వాత వాళ్లు వచ్చిన కృతజ్ఞతలు చెప్పినప్పుడు ఎంతో ఆనందం కలుగుతుంది. ఒక విధమైన సంతృప్తి కల్గుతుంది.



- ముస్కు సంతోష్‌రెడ్డి, ప్రైవేటు టీచర్

పండుటాకులకు అండ

వృద్ధాశ్రమాలకు ఏటా రూ.50 లక్షల వరకు ఖర్చు

న్యూస్‌టుడే, సిరిసిల్ల గ్రామీణం

బిడ్డ పుట్టగానే కంటికిరెప్పలా కాపాడుకుంటారు తల్లిదండ్రులు. ఎన్నో కష్టనష్టాలను ఎదుర్కొని వారిని ప్రయోజకులను చేస్తారు. తీరా పిల్లలు పెద్దయిన తరవాత కన్నవారి ఆలనా పాలనా చూడకుండా రోడ్డున పడేస్తున్నారు. ఇలా నిరాదరణకు గురయ్యే వృద్ధుల కోసం ప్రభుత్వం తంగళ్లపల్లి మండలం మండెపల్లి, ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో వృద్ధాశ్రమాలు నిర్మించింది. ఇందులో చేరిన వారిని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ వారిలో మనోధైర్యాన్ని నింపుతూ శేషజీవితాన్ని సంతోషంగా గడపడానికి తోడ్పడుతున్నారు. వృద్ధుల దినోత్సవం సందర్భంగా 'న్యూస్‌టుడే' ప్రత్యేక కథనం.

తంగళ్లపల్లి మండలం మండెపల్లి వృద్ధాశ్రమంలో 25 మంది, ఎల్లారెడ్డిపేటలో 14 మంది ఆశ్రయం పొందుతున్నారు. వీరిలో పురుషులు 18 మంది, స్త్రీలు 21 మంది ఉన్నారు.

- పిల్లలు పట్టించుకోకపోవడం వల్ల వచ్చినవారు కొందరు అయితే, మరికొందరు కోడళ్లు సరిగ్గా చూడకపోవడంతో వచ్చి ఉంటున్నారు. భర్త పోరు భరించలేక కొందరు, భార్య పోరు భరించలేక ఇంకొందరు ఉంటున్నారు.
- ప్రభుత్వం ప్రతి సంవత్సరం రూ.50 లక్షల వరకు ఖర్చు చేస్తోంది. వృద్ధులు విలాసవంతంగా, సంతోషంగా జీవించేందుకు వీటిని వ్యయం చేస్తున్నారు.
- ప్రభుత్వం 75 శాతం నిధులు ఇస్తే, ఎన్‌జీవోలు 25 శాతం సమకూరుస్తున్నాయి. ఈ ఆశ్రమాల్లో ఉండేవారిని సినిమాలు, దేవాలయాల సందర్శన, పర్యాటక ప్రాంతాలకు తీసుకెళ్లి వారిలో ఉన్న బాధను, ఒత్తిడిని తగ్గించి వారు సంతోషకరమైన జీవితం గడపడానికి కృషి చేస్తున్నారు.
- ఇప్పటి వరకు వృద్ధాశ్రమాల నిర్వాహకురాలు మమత సుమారు 12 వరకు వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఆలయాల సందర్శన, సినిమాలు, సిద్దిపేటలోని కోమటి చెరువు వంటి ప్రాంతాలకు తీసుకెళ్లి వారిలో ఆనందాన్ని నింపారు.


ఉదయాన్నే పేపర్ చదువుతున్న వృద్ధులు


మండెపల్లి వృద్ధాశ్రమంలో యోగా చేస్తున్న వృద్ధులు

సంతోషంగా ఉన్నారు

ఎల్లారెడ్డిపేటలో 2023 ఫిబ్రవరి, మండెపల్లిలో 2023 జూన్‌లో వృద్ధాశ్రమాలను ప్రారంభించాం. వీటిలో 39 మంది వరకు ఆశ్రయం పొందుతున్నారు. రెండింటిలో 50 మంది వరకు ఉండే అవకాశం ఉంది. ఇందులో ఉన్నవారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వారు సంతోషంగా ఉండేలా కృషి చేస్తున్నాం.

- లక్ష్మీరాజం, జిల్లా సంక్షేమ అధికారి

నేర వార్తలు

మనస్తాపంతో యువతి ఆత్మహత్య


గంగ

చందుర్తి, న్యూస్‌టుడే: భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని మనస్తాపం చెంది వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన చందుర్తి మండలంలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్థులు, పోలీసుల కథనం ప్రకారం... లింగంపేటకు చెందిన కర్ల గంగ (22) అనే యువతికి, చింతల్‌ఠాణాకు చెందిన గంగు దేవరాజుతో సంవత్సరం క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా వీరి మధ్య మనస్పర్థలు రావడంతో తల్లి ఇంటి వద్ద ఉంటుంది. భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని, ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడిందని తల్లి మంజుల పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తన మృతికి ఎవరూ కారణం కాదని మృతురాలు లేఖలో పేర్కొన్నట్లు తెలిపారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాబు తెలిపారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

వేములవాడ, న్యూస్‌టుడే: వేములవాడ పట్టణంలోని భగవంతరావునగర్‌కు చెందిన మామిండ్ల మల్లయ్య హత్య కేసులో సోమవారం నిందితులను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ వీర ప్రసాద్ తెలిపారు. ఆస్తి పంపకాల విషయంలో మల్లయ్య మొదటి భార్య కుమారుడు రాజు, కూతుళ్లు అత్తిలి జమున, లంబ మౌనిక, అల్లుళ్లు అత్తిని రాజేందర్, లంబ బాలకృష్ణ కలిసి పథకం ప్రకారం హత్య చేసినట్లు పేర్కొన్నారు. మల్లయ్య రెండో భార్య పద్మను కూడా తీవ్రంగా గాయపరిచినట్లు చెప్పారు. 24 గంటల్లో నిందితులను పట్టుకొని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెల్లడించారు.

రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

వెంకటాపూర్(ఎల్లారెడ్డిపేట): ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ వద్ద సోమవారం రాత్రి చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఆరుగురు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కామారెడ్డి- కరీంనగర్ ప్రధాన రహదారి గుండా వెంకటాపూర్ నుంచి రెండు పడక గదుల ఇళ్ల వైపు సామగ్రితో వెళుతున్న ట్రాలీ సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న ప్రయాణికుల ఆటోను ఢీకొట్టిన అనంతరం ద్విచక్రవాహనంపై బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్న వెంకటాపూర్ వాసులు సిరిసిల్ల సంతోష్, రాగుల చందులతోపాటు ప్రయాణికుల ఆటోలోని దుమాల గ్రామానికి చెందిన శ్రావణ్, నవీన్, ట్రాలీ ఆటోలో ఉన్న బాలయ్య, పర్శరాములు గాయపడ్డారు. క్షతగాత్రులను సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వీరిలో రాగుల చందు ఆందోళనకరంగా ఉండటంతో కరీంనగర్‌కు తీసుకెళ్లారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడికి..

బోయినపల్లి, న్యూస్‌టుడే: ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో వృద్ధుడికి తీవ్ర గాయాలైన ఘటన బోయినపల్లి మండలం వెంకట్రావుపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం సిరిసిల్ల - కరీంనగర్ ప్రధాన రహదారిలో వెంకట్రావుపల్లి బస్టాపు వద్ద ఆర్టీసీ బస్సు ఆగి ప్రయాణికులను దింపుతుండగా గ్రామానికి చెందిన రాగటి ఎల్లయ్య బస్టాపు వద్ద రోడ్డు దాటుతున్నాడు. ఈ క్రమంలో సిరిసిల్ల నుంచి కరీంనగర్ వెళ్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన నాన్‌స్టాప్ బస్సు ఎల్లయ్యను ఢీకొట్టింది. తీవ్ర గాయాలైన అతనిని స్థానికులు 108 అంబులెన్సులో సిరిసిల్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు వివరాలు నమోదు చేసుకున్నారు.

కందికట్కూర్‌లో చోరీ

ఇల్లంతకుంట, న్యూస్‌టుడే: ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామానికి చెందిన నార్ల శ్రీనివాస్ ఇంట్లో ఆదివారం రాత్రి దొంగతనం జరిగిందని ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా అనారోగ్యంతో మంచానికే పరిమితమయ్యాడని, అతను దాచుకున్న రూ.80 వేలు చోరీ అయినట్లు శ్రీనివాస్ చిన్నమ్మ గనవేని గౌరవ్వ ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి


నవీన్

రుద్రంగి, న్యూస్‌టుడే: గుండెపోటుతో విద్యార్థి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి రుద్రంగి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రుద్రంగికి చెందిన ఎల్లకొండ నవీన్(23) కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో ఎంబీఏ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఆదివారం ఇంటి వద్ద ఉండగా అకస్మాత్తుగా గుండెపోటు రావటంతో ఆసుపత్రికి తరలించే క్రమంలో మార్గమధ్యలోనే మృతి చెందాడు. చిన్న వయసులోనే నవీన్ మృతి చెందడంతో తల్లిదండ్రులు లక్ష్మి, గంగాధర్ శోకసంద్రంలో మునిగిపోయారు. ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కుక్క దాడిలో బాలికకు గాయాలు

రుద్రంగి: రుద్రంగి మండలం దెగావత్ తండాలో గుగులోత్ దివ్య అనే చిన్నారి ఇంటి ముందు ఆడుకుంటూ ఉండగా వీధి కుక్క అకస్మాత్తుగా దాడి చేయటంతో చేతికి తీవ్ర గాయమైంది. బాలికను తల్లిదండ్రులు చందుర్తి పీహెచ్‌సీకి తరలించి చికిత్స అందించారు. అధికారులు స్పందించి వీధి కుక్కలను నియంత్రించేందుకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఆటో యూనియన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్

వేములవాడ, న్యూస్‌టుడే: ఆటో యూనియన్ వేములవాడ అధ్యక్షుడి ఎన్నికలు సోమవారం జరిగాయి. అధ్యక్ష స్థానానికి ముగ్గురు పోటీ పడగా చంద్రగిరి శ్రీనివాస్ విజయం సాధించాడు. అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి రాకేష్ ప్రమాదవశాత్తు గాయపడగా అతనిని విప్ పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు బింగి మహేశ్, శ్రీనివాస్, అజయ్, రాజు, లక్ష్మీరాజం, నాయకులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

'భారాస హయాంలో ఉద్యమకారులకు గుర్తింపులేదు'


బాధిత కుటుంబ సభ్యులను చరవాణి ద్వారా మంత్రి పొన్నంతో మాట్లాడిస్తున్న చక్రధర్‌రెడ్డి

పోత్గల్ (ముస్తాబాద్), న్యూస్‌టుడే: భారాస ప్రభుత్వ హయాంలో ఉద్యమకారులకు గుర్తింపులేదని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు కనమేని చక్రధర్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో పని చేసిన ముస్తాబాద్ మండలం పోత్గల్ గ్రామానికి చెందిన విశ్రాంత ఎంఈవో బత్తిని పర్శరాములుగౌడ్ మృతి చెందగా సోమవారం సంస్మరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర నాయకుడు చక్రధర్‌రెడ్డి హాజరై మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌తో బాధిత కుటుంబ సభ్యులను చరవాణిలో మాట్లాడించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని మంత్రి భరోసా కల్పించారు.

ఒకే నంబర్‌పై రెండు ద్విచక్రవాహనాలు


ఒకే నంబర్‌పై రెండు వాహనాలు

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఒకే నంబర్‌పై రెండు ద్విచక్రవాహనాలు తిరుగుతున్న విషయం సోమవారం సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. రెండు ద్విచక్రవాహనాలకు టీఎస్ 02 ఈఎల్ 9059 నంబర్ ప్లేటు పెట్టి తిరుగుతున్నారు. నిత్యం ఎక్కడో ఓ చోట పోలీసులు తనిఖీలు చేస్తున్నప్పటికీ ఈ వాహనాలు వారి కంట పడకపోవడం గమనార్హం.

సిట్టింగ్ జడ్జితో విచారణకు డిమాండ్


కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వీహెచ్‌పీ సభ్యులు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: తిరుపతి లడ్డూ కల్తీ వివాదంపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు చేపూరి అశోక్ డిమాండ్ చేశారు. లడ్డూ విషయంలో జరిగినటువంటి అపవిత్రతను వ్యతిరేకిస్తూ, హిందూ దేవాలయాల పరిరక్షణ కోసం ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం ఉండకూడదన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాలని కోరారు. ఆలయాల ఆస్తిని, దేవాలయాల అభివృద్ధికి, ధార్మిక సంబంధిత సేవా కార్యక్రమాలకు మాత్రమే వాటి ఆదాయాన్ని వినియోగించాలని కోరారు. అనంతరం కలెక్టరేట్ ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక సమరసత విభాగ్ కార్యదర్శి ధనుంజయ్, జిల్లా కార్యదర్శి నాగుల రాములు గౌడ్, కిషోర్, శ్రీనివాస్, గుంటుక పురుషోత్తం, జిందం రవి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని న్యాయవాదుల నిరసన


వేములవాడ కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

వేములవాడ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా న్యాయవాదుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఫెడరేషన్ ఆఫ్ బార్ అసోసియేషన్ ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. న్యాయవాదుల రక్షణ చట్టం, టెన్యూర్ పీపీ నియామకం, 41(1) సీఆర్పీసీ, 35 బీఎన్ఎస్ఎస్ తదితర అంశాలను వెంటనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సదానందం, రజినీకాంత్, సత్యనారాయణ, గోపికృష్ణ, దేవేందర్, దివాకర్, కిశోర్‌రావు, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల గుర్తింపు రద్దు చేయండి

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) జిల్లా కార్యదర్శి ఎరవెల్లి నాగరాజు డిమాండ్ చేశారు. సిరిసిల్లలో సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముస్తాబాద్ మండలంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో బస్సు టైర్ కింద పడి మరణించిన విద్యార్థిని కుటుంబానికి రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలన్నారు. జిల్లాలో ఫిట్‌నెస్ లేని బస్సులను సీజ్ చేయాలని పేర్కొన్నారు. నాయకులు అనిల్, సుమన్, సాయిభరత్, శంకర్ పాల్గొన్నారు.

ఇళ్లు పంపిణీ చేయాలని ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

సిరిసిల్ల కలెక్టరేట్, న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణంలో నిర్మాణం పూర్తయిన రెండు పడక గదుల ఇళ్లను వెంటనే పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూశం రమేశ్ కోరారు. రెండు పడక గదుల ఇళ్లకు అర్హులుగా గుర్తించి డ్రాలో వచ్చిన వారికి పంపిణీ చేయాలని కోరుతూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీపీఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టాలు పంపిణీ చేసిన 44 మందికి ఇంటి స్థలం కేటాయించి, నిర్మాణానికి రూ.5 లక్షలు అందించాలని కోరారు. డ్రాలో ఇళ్లు వచ్చిన వారందరికీ వెంటనే పంపిణీ చేయాలని పేర్కొన్నారు. సిరిసిల్ల పట్టణంలో ఇప్పటి వరకు పంపిణీకి సంబంధించి రీ సర్వే చేసి అనర్హులను తొలగించి, అర్హులైన వారికి కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కోడం రమణ, ఎగమంటి ఎల్లారెడ్డి, సూరం పద్మ, అన్నల్‌దాస్ గణేశ్, ఎలిగేటి రాజశేఖర్, సావనపెల్లి రాములు, బెజిగం సురేశ్, ఒడ్నాల వీరేశం, సందుపట్ల పోచమల్లు, గాజుల రూప, లావణ్య, స్వప్న, తిరుపతి, బాబు తదితరులు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి కృషి


మాట్లాడుతున్న ఛైర్‌పర్సన్ కళ

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్ల పట్టణాభివృద్ధికి పురపాలక సంఘం కృషి చేస్తుందని పురపాలక సంఘం ఛైర్‌పర్సన్ జిందం కళ పేర్కొన్నారు. సిరిసిల్లలోని పురపాలక సంఘం కార్యాలయంలో సోమవారం సాధారణ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ పురపాలక సంఘంలో పని చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులకు చీరలు, యూనిఫాం, ఇతర సరకులు ఇచ్చేందుకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. శౌచాలయాల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.25 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. పలు వార్డుల్లో అభివృద్ధి పనుల కోసం రూ.8 లక్షలను మంజూరు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని సంజీవయ్య కమాన్ దగ్గర ఉన్న దామోదర్ సంజీవయ్య విగ్రహాన్ని పాత బస్టాండ్‌లోని ఆర్అండ్‌బీ డివైడర్ మధ్యలోకి మార్చేందుకు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో కమిషనర్ మీర్జా ఫసహత్ అలీ బేగ్, వైస్ ఛైర్మన్ మంచె శ్రీనివాస్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా ఆదిల్ పాషా

వేములవాడ గ్రామీణం, న్యూస్‌టుడే: మైనార్టీ సెల్ వేములవాడ గ్రామీణ మండల అధ్యక్షుడిగా సయ్యద్ ఆదిల్ పాషా నియమితులయ్యారు. ఈ మేరకు నియామక పత్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు వకులాభరణం శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సహకార సంఘం సేవలు అభినందనీయం



మాట్లాడుతున్న కేడీసీసీబీ ఛైర్మన్ రవీందర్‌రావు

ముస్తాబాద్, న్యూస్‌టుడే: పోత్గల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సేవలు అభినందనీయమని కేడీసీసీబీ ఛైర్మన్ కొండూరి రవీందర్‌రావు పేర్కొన్నారు. ముస్తాబాద్ మండలం పోత్గల్ సహకార సంఘం సర్వసభ్య సమావేశం సహకార సంఘం అధ్యక్షుడు తన్నీరు బాపురావు అధ్యక్షతన సోమవారం జరిగింది. ఇటీవల నియామకమైన ఏఎంసీ ఛైర్‌పర్సన్ తలారి రాణిని సహకార సంఘం అధ్యక్షుడు శాలువాతో సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ మేర్గు రాజేశం గౌడ్, డైరెక్టర్‌లు కట్ట బాపురావు, సతీశ్‌చందర్‌రావు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: సహకార సంఘం అభివృద్ధి చెందాలంటే రైతులు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లించాలని గాలిపెల్లి పీఏసీఎస్ ఛైర్మన్ అనంతరెడ్డి పేర్కొన్నారు. సోమవారం గాలిపెల్లి సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్లలో తరుగు తీయకుండా చూడాలని ఛైర్మన్ దృష్టికి తీసుకువచ్చారు. కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, కేడీసీసీ బ్యాంక్ మేనేజర్ ప్రవీణ్‌కుమార్, సీఈవో మల్లేశం, డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

కోనరావుపేట: రైతన్నకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కోనరావుపేట, కొలనూర్ పీఏసీఎస్‌ల సర్వసభ్య సమావేశం సోమవారం నిర్వహించగా ప్రభుత్వ విప్ పాల్గొన్నారు. వానాకాలంలో కొనుగోలు కేంద్రాల్లో గన్నీ సంచుల సమస్య లేకుండా చూడాలన్నారు. తరుగు, అధిక తూకం లేకుండా ప్రభుత్వపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన దృష్టికి పాలకవర్గం సభ్యులు తీసుకెళ్లారు. సుద్దాల, ధర్మారం గ్రామాల్లో ఎరువుల గోదాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. పీఏసీఎస్ అధ్యక్షులు రామ్మోహన్‌రావు, నర్సయ్య, ఉపాధ్యక్షులు మహేశ్‌యాదవ్, భూమిరెడ్డి, సీఈవోలు రాజేశం, కేశవులు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: తిమ్మాపూర్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు రామగిరి సుధీర్‌రావు అధ్యక్షతన సోమవారం మహాజన సభను నిర్వహించారు. 2024-2025 ఆర్థిక సంవత్సరంలో కార్యాలయంలో ఆర్థికలావాదేవీలను సభ్యులకు వివరించారు. అనంతరం రాచర్ల బొప్పాపూర్ ఏఎంసీ డైరెక్టర్‌గా ఎన్నికైన రాచర్ల గొల్లపల్లి వాసి మర్రి నారాయణరెడ్డిని ఘనంగా సన్మానించారు. పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు కృష్ణమూర్తిశర్మ, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసి చూపించండి

తంగళ్లపల్లి, న్యూస్‌టుడే: గతంలో ఒక్కసారి రాని కేకే మహేందర్‌రెడ్డి కాంగ్రెస్ అధికారంలోకి రాగానే వచ్చి కేటీఆర్ చేసిన అభివృద్ధి గురించి విమర్శించడం సరికాదని, అంతకంటే ఎక్కువ అభివృద్ధి చేసి చూపించాలని మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు పేర్కొన్నారు. సోమవారం తంగళ్లపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్ డీలర్ల నియామకాలకు సంబంధించి రాత్రికి రాత్రి ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. కార్యక్రమంలో భారాస నాయకులు కొయ్యాడ రమేశ్, నర్మెట బాబు, చిలివేరి చిరంజీవి, మీసాల కృష్ణ, బండి జగన్, ప్రేమ్, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

వరి పంటను ధ్వంసం చేసిన అడవిపందులు

గంభీరావుపేట (ముస్తాబాద్), న్యూస్‌టుడే: అడవి పందులు వరి పంటను ధ్వంసం చేసిన ఘటన గంభీరావుపేట మండలం గోరంటాల్ల గ్రామంలో సోమవారం వెలుగుచూసింది. గ్రామ శివారులోని శాతారం హనుమాన్ ఆలయ సమీపంలో చేతికి వచ్చిన వరి పంటను ధ్వంసం చేశాయని రైతులు అంజిరెడ్డి, రాజయ్య, ఎల్లయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు పంటను పరిశీలించి నష్టపరిహారం అందించాలని కోరారు.

సీసీ కెమెరాలతో స్వీయ రక్షణ


మాట్లాడుతున్న ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి

ధర్మారం (కోనరావుపేట), న్యూస్‌టుడే: నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం చేపట్టామని, గ్రామాల్లో స్వీయ రక్షణకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని వేములవాడ ఏఎస్పీ శేషాద్రినిరెడ్డి పేర్కొన్నారు. కోనరావుపేట మండలం ధర్మారంలో సోమవారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. గ్రామంలో సరైన ధ్రువపత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 21 ద్విచక్ర వాహనాలు, ఆటో స్వాధీనం చేసుకొన్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, సమస్యలను నేరుగా తెలుసుకోవటానికి అవకాశం కలుగుతుందన్నారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు సంచరించినా, నేరస్థులు ఆశ్రయం పొందినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో యువత అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. గంజాయి, గుడుంబా తయారీకి సంబంధించిన సమాచారం డయల్ 100కు గానీ, పోలీసులకు గానీ తెలియజేయాలని తెలిపారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఇంఛార్జి ఎస్ఐ కిరణ్‌కుమార్, ఏఎస్ఐ రఘుపతిరెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్తు బకాయిలు చెల్లించండి

సిరిసిల్ల కలెక్టరేట్: సిరిసిల్ల సెస్ పరిధిలోని విద్యుత్తు వినియోగదారులు బకాయిలను చెల్లించాలని సెస్ ఎండీ శ్రీనివాసరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అధికంగా బకాయిలు ఉన్నవారు మూడు, నాలుగు విడతలుగా చెల్లించేందుకు అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

కేజీబీవీ ప్రత్యేకాధికారి బదిలీ

వీర్నపల్లి, న్యూస్‌టుడే: కేజీబీవీ భవనం మీద నుంచి బాలిక దూకిన ఘటనలో ప్రత్యేకాధికారిని బదిలీ చేస్తూ సోమవారం జిల్లా విద్యాధికారి రమేశ్ ఉత్తర్వులు జారీ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం చేసిన ఎస్‌వో లింగవ్వను రుద్రంగి కేజీబీవీకి సీఆర్టీగా బదిలీ చేస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. మమతకు ప్రత్యేకాధికారిగా బాధ్యతలు అప్పగిస్తున్నట్లు తెలిపారు. తక్షణమే బాధ్యతలు చేపట్టి కార్యాలయానికి సమ్మతి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

సిరిసిల్ల (విద్యానగర్), న్యూస్‌టుడే: సిరిసిల్లలోని కుసుమ రామయ్య జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) నాయకులు ఇటీవల జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం అందుకున్న తాడూరి సంపత్‌కుమార్‌ను సోమవారం సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బుర్ర కృష్ణ ప్రసాద్ గౌడ్, ప్రధాన కార్యదర్శి బోయినపల్లి నారాయణ, నాయకులు పాల్గొన్నారు.